రచన - నవంబర్, 1992

"బాస్ ఇంట్లో గొడవపడి వచ్చేట్ట. లంచికి వెళ్ళేలోగా వాడి కళ్ళపడకపోవడం చాలా మంచిది-" అన్నాడు సుబ్బారావు కోలీగ్సును హెచ్చరిస్తూ.

# లంచ్

మా బాస్ పేరు దయానిధి. కానీ కొలీగ్సుందరూ నరరూపరాక్షసుడనీ, నరమాంస భక్షకుడనీ, కిరాతకుడనీ, హిట్లరనీ అంటూంటారు. నేను మాత్రం ఏమీ అనను. ఎందుకంటే ఆయన దగ్గర లేనప్పుడు కూడా ఆయన గురించి ఏమైనా అనడానికి నాకు భయం.

ఒక రోజున నా కొలీగ్ సుబ్బారావు ఆఫీసులో నలుగుర్నీ పోగుచేసి, "ఈ వేళ మనమంతా జాగ్రత్తగా ఉండాలి. బాస్ ఇంట్లో గొడవపడి టిఫిన్ చేయకుండా వచ్చేట్ట. ఆకలిమీదున్నపుడు వాడి నోటికి హద్దూ, అదుపూ ఉండవు. లంచికి వెళ్ళేలోగా వాడి కళ్ళ పడకపోవడం మంచిది" అని చెప్పాడు.

"ఇంట్లో అలిగాడంటున్నావు. లంచికి వెడతాడా?" అనడిగాడు.

"ఎందుకు వెళ్ళడు? ఇంటావిడ ఫోన్లో బ్రతిమాలుకుంది. నెమ్మదిగా కరిగిపోతాడు. అదీకాక వాడి కోపాన్ని పుచ్చుకుందుకు మనమందరమూ ఉన్నాం కదా - అందుకని పెళ్ళామంటే బాగానే ఉంటాడు. ఇంట్లో కోపం వచ్చినపుడావిడ ఆయన్ను ఆఫీసుకైనా పంపేస్తుంది. ఆఫీసులేని రోజుల్లో మనలాంటి వాళ్ళు నలుగుర్నింటికి పిలిచి ఆహ్వానిస్తుంది. అదేం చిత్రమో - మనల్ని చూస్తే ఆయనకింకెవర్నీ తిట్టబుద్ధేయదు. ఆయన ఆగ్రహాన్ని స్తోత్ర పాఠాలలో మనం కరిగిస్తే అందుకు కృతజ్ఞతగా ఆవిడ మంచి టిఫిను పెట్టి పంపిస్తుందిలే! ఇవన్నీ పాత కథలే, మామూలే! అందుకే ముందుగా హెచ్చరిస్తున్నాను. లంచిలోగా బాసుకు దొరక్కూడదు" అన్నాడు సుబ్బారావు.

నా దురదృష్టం!

ఇంటినుంచి అర్ధాంగి ఫోన్ చేసింది. నా తమ్ముడు స్కూటర్ యాక్సిడెంటు చేశాడట. పెద్దగా ప్రమాదం లేదు కానీ నేనోసారి ఇంటికి వెళ్ళిరావాలి.

"ఇలాంటి వాటికి ఆటోమాటిక్ పర్మిషనుంటుంది. కానీ బాస్ మూడ్ బాగోలేదుగా. అడిగితే కరిచేస్తాడు. ఎవరికంటా పడకుండా సైలెంటుగా వెళ్ళి పని చూసుకొచ్చేయ్. నీ

వర్కేదైనా వుంటే మేం చూసుకుంటాంలే!" అని హామీ యిచ్చి పంపేశాడు సుబ్బారావు.

ఇంటికి వెళ్ళాను. స్కూటరు పాడయింది కానీ నా తమ్ముడికి కనీసం ఎక్కడా గీరుకోనైనా లేదు. అయినా ఇంట్లో పెద్ద రభస. హడావుడి. నేను రెండు గంటల దాకా మళ్ళీ ఆఫీసు చేరుకోలేకపోయాను.

వెళ్ళేసరికి -

బాస్ నేనిలా వెళ్ళగానే నాకోసం ఫోన్ చేశాట్ట. రాగానే తన గదికి పంపమన్నాట్ట!

అంటే రెండుగంటలపాటు నేను లేనని ఆయనకు తెలిసిపోయి ఉంటుంది. ఇప్పుడేం చేయాలి?

నా తమ్ముడికి పెద్ద పెద్ద గాయాలు తగిలినా బాగుండేది....

ఇప్పుడేం చేయను?

భయపడుతూనే బాస్ గదిలో అడుగుపెట్టాను.

ఎదురుగా బాస్. ఆయన బల్లమీద ఫోన్ కొరడాలాగా, ఫైళ్ళు బాంబుల్లాగా కనబడుతున్నాయి. ఆయన చూపులు లేజరు కిరణాల్లా నన్ను పొడుస్తున్నాయి.

ఎవరో తోస్తున్నట్లుగా ముందడుగు నెమ్మది నెమ్మదిగా వేస్తున్నాను.

అప్పుడు బాస్ వడ్డించిన విందు భోజనంలా ఉన్న నన్నే చూస్తూ రిసీవరెత్తి అలవాటైన ఓ నంబరు తిప్పి, "హలో... డార్లింగ్...ఈ పూట నేను లంచికి ఇంటికి రావడం లేదు-" అని ఫోన్ పెట్టేశాడు.

✦ ✦ ✦